ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com


నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -110 పేజీలు - 04 వెల - 04/- గురువారం 7 మే 2026

# విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్

సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం



**విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు గ్రీన్ సిగ్నల్**

**సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్**

**కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు**

**తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమ**

**రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం...**

**39 వేల మందికి ఉద్యోగాలు**

**నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దాం**

**అమరావతిమే 6 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వస్తోంది. విశాఖలో రిలయన్స్ సంస్థ రూ. 1,08,010 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అలాగే సత్యసాయి జిల్లాలో రూ. 51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ను, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను కూడా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. కడపలో రూ. 12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును, తిరుపతిలో రూ. 2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. వీటితో పాటు పలు పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది.
ప్రతీ ఒప్పందం గ్రౌండ్ కావాలిరాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వచ్చిన ప్రతీ ప్రతిపాదనా ఒప్పందంగా మారాలని, కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందం పెట్టుబడిగా రూపాంతరం చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. **మిగతా 2లో...**

# 'కూల్ క్యాపిటల్'గా ఆంధ్రప్రదేశ్




**శ్రీసిటీలో క్యారియర్ ఏసీల తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి**

**రూ.1000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు.. 3000 మందికి ఉపాధి అవకాశాలు**

**దేశానికి 'కూల్ క్యాపిటల్'గా ఆంధ్రప్రదేశ్: మంత్రి లోకేశ్**

**రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడి**

**తిరుపతిమే 6 ఆంధ్ర ప్రగతి**

ఏపీని పారిశ్రామికంగా, సాంకేతికంగా అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ప్రపంచ ప్రసిద్ధ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ 'క్యారియర్ గ్లోబల్' యూనిట్‌కు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కోసం క్యారియర్ సంస్థ సుమారు **మిగతా 2లో...**



# విత్తన సరఫరా వేగంగా చేయాలి

**: చంద్రబాబునాయుడు**

**మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్**

**పంటలకు ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా అధిక ఆదాయం**

**వ్యవసాయ, ఉద్యాన పంటల కొనుగోళ్ల అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతిమే 6 ఆంధ్ర ప్రగతి**

ఈ ఏడాది మే 15 నుంచే రైతులకు సాగునీరు అందించనున్న దృష్ట్యా రాష్ట్రంలో వేగంగా విత్తన సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. విత్తనాల సరఫరా కోసం రూ. 200 కోట్లు కేటాయించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో బుధవారం రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ తదితర పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమీక్ష నిర్వహించారు. **మిగతా 2లో...**



# 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

**సిఎం అభ్యర్థిపై బిజెపిలో సమాలోచనలు -ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు**

**కోల్‌కతా,మే 6 ఆంధ్ర ప్రగతి**

పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు. బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే 9వ తేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార **మిగతా 2లో...**

# పూర్తి మెజార్టీ లేదుగా?

**విజయ్‌కు గవర్నర్ షాక్**

**118 మంది ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి**

**మద్దతు ఇచ్చే పార్టీల లేఖలు అవసరమని సూచన**

**పూర్తి మెజార్టీ ఉంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం**

**గవర్నర్ విశ్వనాథ్‌తో భేటీలో విజయ్‌కు స్పష్టీకరణ**

**నేటి ప్రమాణ స్వీకారంపై సందిగ్ధత**

**చెన్నై,మే 6 ఆంధ్ర ప్రగతి**

టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పించాలని, అప్పుడే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారం**మిగతా 2లో...**



# నేడు, రేపు కలెక్టర్ల సదస్సు




**అమరావతిమే 06 (రిపబ్లిక్ న్యూస్):**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 7వ తేదీ నుంచి రెండు రోజుల పాటు 7వ కలెక్టర్ల సదస్సు జరగనుంది. రాజధాని అమరావతిలోని సచివాలయంలో జరగనున్న ఈ సదస్సులో జిల్లా కలెక్టర్లతోపాటు అన్ని శాఖల అధిపతులు, ముఖ్యకార్యదర్శులు హాజరుకానున్నారు. ఇటీవల కాలంలో ప్రజా ప్రతినిధులతో సిఎం చంద్రబాబు జిల్లాల**మిగతా 2లో...**

# 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను నిలిపివేసిన ట్రంప్

**ఇరాన్‌తో చర్చల్లో పురోగతి**

**అందుకే ఈ నిర్ణయమన్న ట్రంప్**

**ఇరాన్‌పై దిగ్బంధనం మాత్రం కొనసాగుతుందని స్పష్టీకరణ**

**ఇరాన్ సైనిక శక్తిని పూర్తిగా దెబ్బతీశామని వ్యాఖ్య**



# ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

**హైదరాబాద్ :మే 6 ఆంధ్ర ప్రగతి**

ధాన్యం కొనుగోళ్ల అం శంపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన సచివాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రాష్ట్రంలో రికార్డ్ స్థా యిలో ధాన్యం దిగుబడి అయ్యిందని, దేశంలోనే రికార్డ్ స్థాయిలో దిగుబడి ,కొనుగోళ్లు జరిపింది రాష్ట్రంలోనే అని మంత్రి స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



# ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

**విధులకు ఏళ్లుగా గౌర్హాజరు**

**-51 మందిపై వేటు వేసిన ప్రభుత్వం**

**క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదన్న మంత్రి సత్యకుమార్**

**అమరావతి,మే 6 ఆంధ్ర ప్రగతి**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యుల పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**మిగతా 2లో...**



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఉద్యోగాల కల్పనే కూటమి లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

రూ. 1,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,000 మందికి ఉపాధి, జీవనోపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... క్యారియర్ కేవలం ఒక కంపెనీ కాదని, ప్రపంచ శీతలీకరణ సాంకేతికతలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మార్గదర్శి అని ప్రశంసించారు. తన జీవితంలో కొనుగోలు చేసిన మొట్టమొదటి ఏసీ కూడా క్యారియర్ బ్రాండ్‌దేనని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంటూ, సీఎం చంద్రబాబు నాయుడు తన గదిని ఎప్పుడూ 17 డిగ్రీల సెల్సియస్ వద్ద చల్లగా ఉంచుకోవడానికి ఇష్టపడతారని, ఇప్పుడు ఆ గదిలో కూడా క్యారియర్ ఏసీనే ఉందని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో సభలో నవ్వులు పూశాయి.

**డేటా సెంటర్ల తయారీ హబ్‌గా ఏపీ**

అనంతరం మంత్రి లోకేశ్ రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలపై తన దార్శనికతను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌ను కేవలం డేటా సెంటర్లను ఆకర్షించే రాష్ట్రంగా కాకుండా వాటికి అవసరమైన పూర్తి తయారీ పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించే హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "మేం కేవలం డేటా సెంటర్లను నిర్మించడం లేదు, వాటికి అవసరమైన పూర్తి వ్యవస్థను ఇక్కడే నిర్మిస్తున్నాం" అని ఆయన అన్నారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొని ఉందని, ఈ రేసులో ఏపీ ముందు వరుసలో నిలుస్తుందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. డేటా సెంటర్లకు అత్యాధునిక కూలింగ్ సిస్టమ్స్, అధిక సామర్థ్యం గల చిల్లర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటివి అత్యంత కీలకమని, వీటికి అవసరమైన బలమైన సహాయక పర్యావరణ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించామని వివరించారు.

ఈ బృహత్తర లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను, శ్రీసిటీని ఎంచుకున్నందుకు క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు ఆయన స్వాగతం పలికారు. ఈ పెట్టుబడి రాష్ట్ర డిజిటల్, పారిశ్రామిక అభివృద్ధిని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. క్యారియర్ వంటి సంస్థల రాకతో, డేటా సెంటర్లకు అవసరమైన కీలక పరికరాల తయారీ స్థానికంగానే జరిగి, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంటుందని మంత్రి లోకేశ్ తెలిపారు.

# పూర్తి మెజార్టీ లేదుగా? : విజయ్‌కు గవర్నర్ షాక్

**మొదటిపేజీ తరువాయి**

. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్గేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవికే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

**మొదటిపేజీ తరువాయి**

వారీ సమీక్షా సమావేశాలు నిర్వహించిన క్రమంలో జరుగుతున్న ఈ 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రాధాన్యత సంతరించుకుంది. పరిపాలనలో ప్రభుత్వ సమర్థతను మరింత మెరుగుపరిచేలా దిశానిర్దేశం చేయడం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతిని సమీక్షించడం లక్ష్యంగా రెండు రోజుల కలెక్టర్ల సదస్సు ఉండనుంది. నాలుగు జిల్లాలకు చెందిన కలెక్టర్లు.. తాము ఆచరించిన బెస్ట్ ప్రాక్టీసును తొలిరోజు ప్రెజెంట్ చేయనున్నారు. రెండోరోజు సంజీవని, సమ్మర్ యాక్షన్ ప్లాన్, సూపర్ సిక్స్, సంక్షేమం, రెవెన్యూ వంటి వాటిపై సిఎం సమీక్షించనున్నారు. ఈ రెండు రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకూ రెండు రోజులపాటు ఈ సదస్సు జరగనుంది.

# ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 51 మంది వైద్యులను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించారు. శాశ్వత ఉద్వాసనకు గురైన 51 మందిలో బోధనాసుపత్రులకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు 8 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 41 మంది, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో ముగ్గురు ప్రొఫెసర్లపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలగించిన వారిలో కొందరు ఏడేళ్ల నుంచి, మరికొందరు ఆరేళ్ల నుంచి విధులకు దూరంగా ఉంటూ సొంత వ్యాపకాలు సాగిస్తున్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్-1964 ప్రకారం ఏడాదికి మించి విధులకు గైర్హాజరైతే రాజీనామా చేసినట్లుగానే పరిగణించే అధికారం ప్రభుత్వానికి ఉంది. నిబంధనల మేరకు వీరికి ముందస్తుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వడానికి తగిన సమయం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఏడాదిలోపు గైర్హాజరీలో ఉన్న మరో 33 మంది వైద్యులు ఇందులో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఛార్జిమెమోలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా విధుల్లో చేరని పక్షంలో వీరిని కూడా విధుల నుంచి తొలగించనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వ హెచ్చరికలతో ఇప్పటికే 11 మంది వైద్యులు తిరిగి విధుల్లో చేరారు. వైద్యుల బాధ్యతారాహిత్యాన్ని ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. . త్వరలోనే మరో ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా ఇటువంటి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విధులకు గైర్హాజరైన వారిలో కాకుండా, మరో 33 మంది వైద్యులకు ప్రభుత్వం ఛార్జిమెమోలు జారీ చేసింది. వైద్య సేవలకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను నిలిపివేసిన ట్రంప్

**మే 6 ఆంధ్ర ప్రగతి**

ఇరాన్‌తో చర్చల్లో పురోగతి సాధించామని, పాకిస్థాన్ వంటి దేశాల అభ్యర్థన మేరకు కీలక నిర్ణయం తీసుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా నేతృత్వంలో చేపట్టిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అయితే, ఇరాన్‌పై విధించిన దిగ్బంధనం మాత్రం పూర్తిస్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ట్రంప్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇరాన్‌తో తుది ఒప్పందం దిశగా గణనీయమైన పురోగతి సాధించాం. పాకిస్థాన్, ఇతర దేశాల అభ్యర్థన మేరకు 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' కింద నౌకల కదలికలను కొంతకాలం నిలిపివేయాలని నిర్ణయించాం. ఒప్పందం ఖరారవుతుందో లేదో చూసేందుకే ఈ విరామం" అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ఇటీవలి సైనిక చర్యల్లో ఇరాన్ నావికా, వైమానిక దళాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. వారి సైనిక శక్తిని సర్వనాశనం చేశామని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని, అందుకే ఇరాన్ ఒప్పందం కోసం ముందుకు వస్తోందని ఆయన అన్నారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చల ఫలితం వెలువడేంత వరకు ఈ తాత్కాలిక విరామం కొనసాగనుంది.

# 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమిక్ భట్టాచార్య

తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గంలో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు.

# విత్తన సరఫరా వేగంగా చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ సమీక్షకు మంత్రి కె. అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతుకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన పంట దిగుబడులు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు

మరిన్ని పంటలను ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సేంద్రీయ సాగుకు కంపోస్టు ఎరువును సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట ఉత్పత్తి వస్తుందని అధికారులు వివరించారు. మొక్క జొన్న సహా ఇతర పంటల ద్వారా ఇథనాల్ తయారీకి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. అరటి, ఆయిల్ పామ్, మిర్చి, కోకో లాంటి పంటలకు సంబంధించి ధరల సమస్య లేదని రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీజన్ కంటే ముందే రాష్ట్రంలోని నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వచ్చే పంట సీజన్ కు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. నాఫెడ్ నుంచి మినుములు ఇతర వాణిజ్య పంటల్ని కొనుగోలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. పీఎండీఎస్ పథకం ద్వారా తక్కువ యూరియా వినియోగానికి ఇచ్చే ప్రోత్సాహకం పై కేంద్రంతో మాట్లాడాలని వారికి సూచించారు. మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

**మొదటిపేజీ తరువాయి**

ఈ రబీ సీజన్ లో 67 లక్షల ఎకరాలలో వరి సాగులో, 141 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి రానుందని, 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధమయ్యిందని, ఇప్పటి వరకు ప్రభుత్వం 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ. 2,310 కోట్లు చెల్లించినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాల అంశలో బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గతంలో లే ని విధంగా వసతులు కల్పించామని, అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడిసి పోకుండా ఉండేందుకు 2.63 లక్షల టార్పాలిన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 18.75 కోట్ల గన్ని బ్యాగులు అందుబాటులో ఉం చామని, 64.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యం ఉందన్నారు. అదనంగా 11.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు గోదాముల గుర్తించినట్లు మంత్రి తెలియజేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు గా ను 6,200 వాహనాల ఏర్పాటు చేశామని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు దాహార్తి తీర్చేందుకు వీలుగా మం చినీటి సరఫరా, ఓఆర్ఎస్ సరఫరా ఏర్పాట్లు చేశామని మంత్రి చెప్పుకొచ్చారు. కొనుగోలు కేంద్రాలలో ఉద యం, సాయంత్రం కొనుగోలుకు ఆదేశాలు జారీ చేశామని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి నోడల్ అధికారి పర్యవేక్షణ ఉంటుందని, అన్నింటికీ మించి ధాన్యం కొనుగోలు అంశంపై ప్రత్యేకించి పౌ ర సరఫరాల శాఖా కేంద్ర కార్యాలయంలో కంట్రోల్ రూ మ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. తాలు పేరుతో కోత విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, తూకం అంటూ తగ్గిస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు.

రైతులకు నష్టం కలిగించే ఏ చర్యను ప్రభుత్వం సమర్థించదని మంత్రి పేర్కొన్నారు. అకాల వర్షాలు సంభవిస్తే రైతులు, సిబ్బంది చెట్లు కింద, కరెంట్ స్తంభాల దగ్గర ఉంటే పిడుగుపాటుకు గురి కాకుండా సూచనలు చేస్తున్నామని, వాతావరణంలో సంభవిస్తున్న మార్పులను ఎ ప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలకు సమాచారం అం దించేందుకు ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా ప్రత్యేక టోకెన్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో బిఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మడం లేదని, వరుసగా నాలుగు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా గుణపాఠం నేర్చుకోలేదని ధ్వజమెత్తారు.

# విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్

**మొదటిపేజీ తరువాయి**

ఒక పెట్టుబడి, పరిశ్రమ రాష్ట్రానికి వచ్చే విషయంలో అనుమతుల నుంచి శంకుస్థాపన, ప్రారంభోత్సవం వరకు నిర్దేశిత గడువులోగా జరిగేలా చూడాలన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీల శంకుస్థాపన నుంచి ఉత్పత్తి వరకూ నిర్దిష్టమైన కాలపరిమితిలో జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వపరంగా ఇవ్వాల్సిన అనుమతుల విషయంలో ఒక్క రోజు కూడా జాప్యం జరగకూడదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనుమతుల జారీ విషయంలో ఏపీ బ్రాండ్ సృష్టించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెట్టుబడులను ఆకర్షించాలంటే ఇతరుల కంటే మనం ఎలా భిన్నమో ఏపీలో అనుమతులు ఎంత సులభతరమో వారికి చెప్పాలని స్పష్టం చేశారు. ఏపీలో ప్రాజెక్టులు రావాలన్న తపన ఉన్న అధికారులను అనుమతులు ఇచ్చే స్థానాల్లో నియమించాలని సూచించారు.

**వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్‌లో ఎంఎస్ఎంఈలు కీలకం**

సచివాలయంలో జరిగిన 17వ ఎస్ఐపీబీ సమావేశంలో 25 ప్రాజెక్టులకు చెందిన రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 39,067 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పెట్టుబడుల విషయంలో భారీ పరిశ్రమలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో ఎంఎస్ఎంఈలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ విషయంలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషిస్తాయి. అన్ని పారిశ్రామిక ప్రాంతాలకు గ్యాస్ పైప్ లైన్ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఫుడ్ ప్రాసెసింగ్ లో రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు గ్రౌండ్ అయ్యేలా చూడాలి. మన రాష్ట్రంలో ఉద్యాన, వాణిజ్య పంట ఉత్పత్తులకు విలువ జోడింపు జరగాలి. ఆయిల్ పాం, మామిడి, కొబ్బరి, కోకో సహా పలు పంటలకు వ్యాల్యూ అడిషన్ ఇస్తే రైతులకు ఎంతో మంచి జరుగుతుంది" అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, మంత్రులు టీజీ భరత్, అచ్చెన్నాయుడు, సుభాష్, వివిధ శాఖల అధికారులు, వర్చువల్‌గా మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

**17వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రతిపాదనల వివరాలు**

ఇంధన రంగం

1. రిలయన్స్ ఇండస్ట్రీస్ - శ్రీసత్యసాయి జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు రూ.51,300 కోట్ల పెట్టుబడులు, 20 వేల మందికి ఉద్యోగాలు
2. క్లీన్ రెన్యూబుల్ ఎనర్జీ హైబ్రీడ్ త్రీ లిమిటెడ్, నంద్యాలలో రూ.155 కోట్ల పెట్టుబడులు, 40 మందికి ఉద్యోగాలు
3. క్లీన్ ఎనర్జీ హైబ్రీడ్ ట్వెల్వ్ లిమిటెడ్ అనంతపురం జిల్లా రూ.779 కోట్ల పెట్టుబడులు, 125 మందికి ఉద్యోగాలు
4. క్లీన్ ఎనర్జీ హైబ్రీడ్ థర్టీన్ లిమిటెడ్ అనంతపురం జిల్లా రూ.779 కోట్ల పెట్టుబడులు 125 మందికి ఉద్యోగాలు
5. అదాని హైడ్రో ఎనర్జీ ఎలెవెన్ కడప జిల్లాలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ రూ. 12,297 కోట్ల పెట్టుబడులు, 3375 మందికి ఉద్యోగాలు
6. యమాన్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తిరుపతి జిల్లాలో గ్రీన్ హైడ్రోజన్ రూ.9398 కోట్ల పెట్టుబడులు, 5820 మందికి ఉద్యోగాలు
7. అమృత శ్రీ బయో సీఎన్జీ లిమిటెడ్ విజయనగరం రూ.89 కోట్ల పెట్టుబడులు, 402 మందికి ఉద్యోగాలు
8. బాలాజీ బయోఎనర్జీ ఆర్గానిక్స్, నెల్లూరు జిల్లా రూ.59 కోట్ల పెట్టుబడులు, 335 మందికి ఉద్యోగాలు
9. హెచ్ పీసీఎల్ రెన్యూబుల్ గ్రీన్ ఎనర్జీ, ఏలూరు జిల్లా రూ.100 కోట్ల పెట్టుబడులు, 150 మందికి ఉద్యోగాలు
10. ఎనర్జియా బయో ఫ్యూయల్స్ తిరుపతి జిల్లాలో సీబీజీ ప్లాంట్ రూ.59 కోట్ల పెట్టుబడులు, 335 మందికి ఉద్యోగాలు
11. విభా బయో ఫ్యూయల్స్ తూర్పుగోదావరి జిల్లా రూ.67 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు
12. ఐఓసీ జీపీఎస్ రెన్యువబుల్స్ ఎన్టీఆర్ జిల్లాలో సీబీజీ ప్లాంట్ రూ.120 కోట్లు పెట్టుబడులు, 200 మందికి ఉద్యోగాలు,
13. డెల్టా బయోగ్యాస్ పలనాడు జిల్లా రూ. 100 కోట్లు పెట్టుబడులు, 750 మందికి ఉద్యోగాలు

ఐటీ

14. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విశాఖలో డేటాసెంటర్ ఏర్పాటు రూ.1,08,010 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు
15. క్యారియర్ ఎయిర్ కండిషనింగ్, తిరుపతి జిల్లాలో బల్క్ చిల్లర్స్ తయారీ రూ.863 కోట్ల పెట్టుబడులు, 721 మందికి ఉద్యోగాలు.
16. ఎన్ఎస్టీఎల్ డీఆర్డీఓ, అమరావతి క్వాంటం వ్యాలీ రూ.22.5 కోట్ల పెట్టుబడి, 20 మందికి ఉద్యోగాలు

ఫుడ్ ప్రాసెసింగ్

17. స్నేహా ఫార్మ్స్ లిమిటెడ్ అనంతపురం, అన్నమయ్య జిల్లాలు, రూ,277.94 కోట్ల పెట్టుబడులు, 435 మందికి ఉద్యోగాలు

పరిశ్రమలు

18. గ్రైడోన్ ఎనర్జీ లిమిటెడ్, కర్నూలు జిల్లా, రూ.3149 కోట్ల పెట్టుబడులు, 320 ఉద్యోగాలు
19. అపోలో టైర్స్ , తిరుపతి జిల్లా, శ్రీసిటీ రూ,6100 కోట్లు పెట్టుబడులు, 1000 మందికి ఉద్యోగాలు
20. ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్, ఫ్రాగ్రెన్సెస్ ఇఫ్కో సెజ్ నెల్లూరు, రూ.3153 కోట్ల పెట్టుబడులు, 172 మందికి ఉద్యోగాలు
21. రాయల్ ఎన్ ఫీల్డ్ , తిరుపతి జిల్లా, రూ.2508 కోట్ల పెట్టుబడులు, 3 వేల మందికి ఉద్యోగాలు
22. చెట్టినాడ్ సిమెంట్స్ , పలనాడు జిల్లా, రూ.1340 కోట్లు పెట్టుబడులు, 360 మందికి ఉద్యోగాలు
23. ఏఏకె సౌత్ ఈస్ట్ ఇండియా కాకినాడ జిల్లా, రూ.171.52 కోట్ల పెట్టుబడులు, 102 మందికి ఉద్యోగాలు
24. ఐటీసీ లిమిటెడ్, గుంటూరు జిల్లా రూ.51.65 కోట్ల పెట్టుబడులు, 50 మందికి ఉద్యోగాలు
25. హ్యాంగ్యో ఐస్ క్రీమ్స్ తిరుపతి జిల్లా రూ.74.49 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

గురువారం 7 మే 2026

# సంచార, దళిత, పీడిత కులాల పిల్లల చదువే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం

**..నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ మే 06:**
సంచార, దళిత, పీడిత కులాల పిల్లల చదువే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యమని, బేడ బుడగ జంగం కులానికి తెలుగుదేశం పార్టీ ద్వారానే న్యాయం జరుగుతుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణం వై.యస్.ఆర్ నగర్ లోని బేడా బుడజంగాల విద్యార్థుల వసతి గృహంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి కార్యక్రమంలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ..
బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి మనోహర్ ను తాను చిన్నప్పటి నుంచి చూస్తున్న, తన కులం బాగుకోసం నిరంతరం పనిచేస్తున్నాడని అభినందించారు. పిల్లల భవిష్యత్ కోసం మనోహర్ లాంటి వారు అవసరం అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బేడ బుడగ జంగం ఎస్ సి రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో రెండు సార్లు ఏకగ్రీవంగా తీర్మానం చేసి పార్లమెంట్ కు పంపారని, తాను బేడ బుడగ జంగం ఎస్ సి రిజర్వేషన్ కోసం రెండు సార్లు పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లానని, టీడీపీ మీకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భరోసా ఇచ్చారు. బిక్షాటనతో సంచార జాతి బిడ్డల చదువుకు దూరంగా ఉంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రంలోనే మొట్ట మొదటగా ప్రత్యేకంగా బుడగ జంగాల అర్బన్ రెసిడెన్సీ వసతి నంద్యాలలో ప్రభుత్వ ఏర్పాటు మంచి పరిణామం అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి మనోహర్ మాట్లాడుతూ పార్లమెంట్ లో బేడ బుడగ జంగం కులానికి ఎస్ సి రిజర్వేషన్ కోసం కృషి చేయాలని, నంద్యాల వసతి గృహంకు ప్రభుత్వం స్థలం కేటాయించి శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని, అర్బన్ రెసిడెన్సీయల్ వసతిని అర్బన్ పదం కాకుండా రెసిడెన్సీయల్ గా మార్పుకు చర్యలు తీసుకువాలని, విద్యార్థులకు మినరల్ వాటర్ ఫ్లాంట్ మంజూరు చేయాలని కోరగా వెంటనే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబ్దరి స్పందించి జిల్లా కలెక్టర్ ద్వారా 40 సెంట్ల ప్రభుత్వ స్థలం వసతి గృహంకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ఫ్లాంట్ మంజూరు చేస్తున్నామని, బిక్షాటన మాని ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అవరోధించాలని, ఇక్కడ చదివి ఇటీవల 10 వ తరగతి పరీక్షల్లో 450 మార్కులు సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలని, మీకు ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని టీచర్స్, విద్యార్థులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఎంపీ, డీఈవో జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష ప్రాజెక్టు కో - ఆర్డినేటర్ నిత్యానందరాజులు, కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, ఆప్కాబ్ రాష్ట్ర మాజీ చైర్మన్ బి ఎస్ నవీన్ కుమార్, 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ టీడీపీ ఇంచార్జి మరియు బేడా బుడగజంగాల రాష్ట్ర అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గరాముడు, ఎస్ సి, ఎస్ టి మానిటరింగ్ కమిటీ సభ్యురాలు ఎరుకల రాజేశ్వరమ్మ, హాస్టల్ నిర్వాహకులు గడ్డం సుబ్బారాయుడు. జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.







# సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా వంకిరి రామచంద్రుడు నియామకం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 06:**
నంద్యాల సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ప్రముఖ న్యాయవాది, పాండురంగాపురం బాపూజీనగర్ కు చెందిన వంకిరి రామచంద్రుడు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం నంద్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్.డి.ఓ) మరియు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ సి. విశ్వనాథ్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వంకిరి రామచంద్రుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సబ్ డివిజన్ పరిధిలోని పౌర హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వ నిబంధనల అమలును పర్యవేక్షించడంలో తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదిగా సేవలందిస్తున్న రామచంద్రుడు కమిటీ సభ్యునిగా ఎంపిక కావడం పట్ల తోటి న్యాయవాదులు, మిత్రులు మరియు ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రైతులకు పారదర్శక సేవలు అందించడమే లక్ష్యం.

**..రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం పంపిణీ చేసిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే, 06:**
రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ హక్కులను మరింత భద్రపరచడం, భూములకు సంబంధించి పారదర్శక రికార్డులను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. బుధవారం సి. బెలగల్ మండలం, కొత్తకోట గ్రామం, స్వర్ణ గ్రామ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను జాయింట్ కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూడ రైతులకు భూమిపై పూర్తి హక్కు, భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తోందన్నారు. రాజముద్రతో జారీ చేస్తున్న కొత్త పాసుపుస్తకాలు ప్రభుత్వ ధృవీకరణకు ప్రతీకగా నిలుస్తాయని, భూ రికార్డుల విషయంలో రైతులకు మరింత నమ్మకం కలిగిస్తాయని పేర్కొన్నారు. భూముల వివరాలు స్పష్టంగా, పారదర్శకంగా నమోదు కావడం ద్వారా భవిష్యత్తులో వివాదాలు తగ్గే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాలో ఆదర్శంగా నిలిచిన మల్యాల.!

**..పూడికతీతతో పునర్జీవం పొందిన కృష్ణయ్య కుంట. -జలధార - జలహారతితో మల్యాల గ్రామానికి నీటి భరోసా.**

**గ్రామస్థుల ఐక్యతతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం. -ఉపాధి హామీ పథకం ద్వారా కుంటకు కొత్త జీవం.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 06:**
పశువుల దాహార్తి తీర్చే జీవనాధారం మళ్లీ నిండుతోంది. నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలం, మల్యాల గ్రామండ ఒక చిన్న గ్రామం. కానీ నీటి సంరక్షణలో పెద్ద సందేశాన్ని అందించినది. గ్రామంలోని కృష్ణయ్య కుంట – దాదాపు ఒక ఎకరం విస్తీర్ణంలో ఉన్న ఈ నీటి వనరు, సంవత్సరాలుగా గ్రామ ప్రజలకు, ముఖ్యంగా పశువులకు జీవనాధారంగా నిలిచింది. రోజూ 500 నుంచి 600 పశు వులు ఈ కుంటలోని నీటితో దాహం తీర్చుకుంటూ వచ్చాయి. వేసవిలో నీటి కొరత ఎక్కువయ్యే సమయంలో కూడా ఈ కుంట గ్రామానికి ఆదారంగా నిలిచేది. అవసరమైనప్పుడు గ్రామస్తులు కూడా ఇక్కడి నుంచే నీటిని వినియోగించేవారు.
అయితే, గత రెండు సంవత్సరాలుగా పూడిక తీయకపోవడంతో కుంటలో నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయింది. పరిస్థితి మరింత దిగజారుతూ, కుంట పూర్తిగా ఎండిపోవడానికి చేరువైంది. గ్రామంలో నీటి సమస్య మళ్లీ తలెత్తే సూచనలు కనిపించాయి.
ఈ విషయంపై సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామ ప్రజలకు, పశువులకు ఉపయోగపడే ఈ కృష్ణయ్య కుంటను పునరుద్ధరించడం అత్యవసరమని గుర్తించిన ఆమె, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గారి ఆదేశాల మేరకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుని, కుంటలో పూడిక తీత పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు.



గత రెండు వారాలుగా మట్టి బుట్టలతో మోస్తూ, చెమటోడ్చుతూ పనిచేస్తున్న గ్రామస్థుల ఉత్సాహం చూస్తే ఇది కేవలం పని కాదు – తమ భవిష్యత్తు కోసం చేస్తున్న యజ్ఞంలా అనిపిస్తుంది. ప్రతిరోజూ సుమారు 100 నుంచి 120 మంది వరకు శ్రామికులు పనులకు హాజరై, ఎంతో నిబద్ధతతో కృషి చేస్తున్నారు. గ్రామస్తులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పనుల్లో పాలుపంచుకుంటూ, తమ గ్రామానికి అవసరమైన నీటి వనరును కాపాడుకోవడంలో భాగస్వాములవుతున్నారు. జిల్లా కలెక్టర్ గారి మార్గదర్శకత్వంలో సాగుతున్న ఈ కార్యక్రమం, గ్రామంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.
ఈ పనులకు రు. 4,17,541/- అంచనా వ్యయం కేటాయించబడింది. అలాగే ఖజ కెనాల్ నుండి సిమెంట్ కాల్వ ద్వారా నీటిని ఈ కుంటకు మళ్లించే ఏర్పాట్లు కూడా ఉన్నాయి, ఇది కుంటను మరింత స్థిరంగా నీటితో నింపే కీలక అంశంగా మారింది.
జలధార – జలహారతి కార్యక్రమం కింద చేపట్టిన ఈ చర్యలు ఇప్పటికే ఫలితాలను చూపించడం ప్రారంభించాయి.
పూడిక తొలగింపుతో కుంటలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. దీని వల్ల భూగర్భ జలాలు పునరుద్ధరించబడుతూ, చుట్టుపక్కల బోర్లు, బావుల్లో నీటి మట్టం కూడా పెరుగుతుంది. ఈ మార్పుతో రైతులకు సాగునీటి భరోసా లభించడమే కాకుండా, గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య కూడా గణనీయంగా తగ్గుతుంది. ముఖ్యంగా పశువులకు ఇకపై వేసవిలో నీటి ఇబ్బంది ఉండదనే నమ్మకం గ్రామస్థుల్లో పెరిగింది. మల్యాల గ్రామ ప్రజల ఐక్యత, కృషి, సంకల్పమే ఈ కుంటను మళ్లీ జీవంతో నింపుతోంది. "మన నీరు – మన భవిష్యత్తు" అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ, మల్యాల గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది.
చిన్న ప్రయత్న పెద్ద మార్పు ఇదే మల్యాల విజయగాథ!

# రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించండి.

**..సర్వేకు ముందు రైతులకు ముందస్తు నోటీసులు అందజేయాలి.**

**..నిర్దేశించిన సమయంలోపు రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి.**

**..జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే, 06:**
జిల్లాలో 5వ దశలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, సర్వే నిర్వహణకు ముందు రైతులకు ముందస్తు నోటీసులు అందజేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. బుదవారం కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో 5వ దశలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమాన్ని ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సందర్శించి భూమి సరిహద్దుల నిర్ధారణ, భూ సంబంధిత రికార్డుల పరిశీలన, రోవర్ యంత్రం పని తీరు తదితర అంశాలను జేసీ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వే బృందాలు నిర్వహిస్తున్న కొలతల విధానం, సాంకేతిక పరికరాల వినియోగం, భూ వివరాల నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రైతుల భూముల హద్దులు ఖచ్చితంగా నమోదు కావాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడిన జాయింట్ కలెక్టర్...రీ-సర్వే ప్రక్రియకు సంబంధించిన నోటీసులు మీకు అందాయా?, భూ సర్వే తేదీలు మరియు వివరాలు ముందుగానే తెలియజేస్తున్నారా?, అధికారులు మీ సందేహాలకు సమాధానాలు ఇస్తున్నారా? వంటి అంశాలపై ఆరా తీశారు. రైతులకు పూర్తి సమాచారం అందేలా చూడాలని, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వే ప్రక్రియ వల్ల భూ వివాదాలు తగ్గి రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. భూముల సరిహద్దులు శాస్త్రీయ పద్ధతిలో నమోదు కావడం ద్వారా భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ రికార్డులను నవీకరిస్తోందని తెలిపారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామ పరిధిలో మొత్తం 7,157 ఎకరాల భూమి ఉండగా, సుమారు 2,300 మంది రైతులు ఉన్నారని అధికారులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. రీ-సర్వే ప్రక్రియకు సంబంధించిన రైతుల ఈ-కేవైసీ నమోదు కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించి, ప్రతి అర్హత రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నాగరాజు, సర్వే సిబ్బంది, గ్రామస్థులు, రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాలు పెంచుకుంటే అవకాశాలు అందివస్తాయి.

**-సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ మే 06:**
జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు వారి ఆధ్వర్యంలో సర్వోదయ ఐటిఐ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం – ఉపాధి అవకాశాలు అనే అంశం పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం లో సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూప్రపంచం వేగంగా మారుతోందని,ఈ మారుతున్న కాలంలో కేవలం డిగ్రీలు కలిగి ఉండటం మాత్రమే సరిపోదని నిజమైన విజయం సాధించాలంటే నైపుణ్యాలు ఉండాలన్నారు. నైపుణ్యాలు అంటే కేవలం ఉద్యోగానికి సంబంధించిన సామర్థ్యం మాత్రమే కాదని అవి మన ఆలోచనలను, మన ప్రవర్తనను, మన పనితీరును, మన భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి అన్నారు. యువతకు అపారమైన శక్తి ఉంది. ఆ శక్తిని సరైన దిశలో వినియోగించగలిగితే, ఏ అడ్డంకీ పెద్దది కాదు. ఒక యువకుడు లేదా యువతి నిరంతరం నేర్చుకునే మనస్తత్వాన్ని పెంచుకుంటే, వారు జీవితంలో ఏ రంగంలోనైనా విజయం సాధించగలరని తీయియచేశారు. కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, బృందంగా పనిచేయగలగడం వంటి నైపుణ్యాలు ఈరోజు అత్యంత అవసరం అని వివరించారు. ఈ రోజుల్లో కంపెనీలు, సంస్థలు, ప్రభుత్వ రంగాలు కూడా "ఏం చదివారు?" అన్నదానితో పాటు "ఏం చేయగలరు?" అన్నదానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. నైపుణ్యాలే మన ఆయుధం, ఆత్మవిశ్వాసమే మన బలం, కృషే మన విజయానికి మార్గం అని వివరించారు. సైకాలజిస్ట్ శ్రీమతి జ్యోతిర్మయి మాట్లాడుతూ యువత ముందుగా తమలోని బలహీనతలను గుర్తించి, వాటిని బలాలుగా మార్చుకోవాలన్నారు. మొబైల్ ఫోన్‌ను వినోదం కోసం మాత్రమే కాకుండా, నేర్చుకోవడానికి, కొత్త స్కిల్స్ సంపాదించడానికి, ఆన్‌లైన్ కోర్సులు చేయడానికి ఉపయోగించాలని తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవరత్నం, సెట్కూరు సిబ్బంది నిదీశ్,మౌలాలి మరియు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్ల హక్కుల రక్షణ మన అందరి బాధ్యత.

**-నంద్యాల ఆర్డీవో విశ్వనాథ**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 06:**
వృద్ధాప్యంలో తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవడం పిల్లల కనీస బాధ్యతని, వారి హక్కులకు భంగం కలిగితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నిశాంత్ భవన్‌లో స్టాంపు రైటర్లతో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ
సీనియర్ సిటిజన్లు తమ ఆస్తిని పిల్లల పేరిట రాసేటప్పుడు (గిఫ్ట్ డీడ్ లేదా సెటిల్మెంట్ డీడ్), సదరు పత్రంలో తమ బాగోగులు చూసుకోవాలనే స్పష్టమైన షరతును పొందుపరిచేలా స్టాంపు రైటర్లు వృద్ధులకు సూచించాలని పేర్కొన్నారు ఆస్తి రాసిచ్చిన తర్వాత పిల్లలు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారం ఆ ఆస్తిని తిరిగి స్వాధీనం చేసుకునే అధికారం వృద్ధులకు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. స్టాంపు రైటర్ల పాత్ర: ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో స్టాంపు రైటర్లు కేవలం డాక్యుమెంట్లు రాయడమే కాకుండా, వృద్ధుల ప్రయోజనాలను కాపాడే విధంగా వారికి చట్టపరమైన అవగాహన కల్పించాలని కోరారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వీలునామా లేదా ఆస్తి దస్తావేజులు రాసేటప్పుడు వృద్ధుల సంరక్షణ బాధ్యతను డాక్యుమెంట్‌లో చేర్చడం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, స్టాంపు రైటర్ల సంఘం నాయకులు రమేష్, ఫరూక్, మాలి బాషా తదితరులతో పాటు సీనియర్ సిటిజన్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నంద్యాల మున్సిపాలిటీలో కమర్షియల్ కనెక్షన్ల సొమ్మును.. సొంత ఖాతాకు బదిలింపు.!



**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ మే 06:** నంద్యాల మున్సిపాలిటీ అక్రమాలకు నిలయంగా మారుతోంది. ప్రజా ధనాన్ని కాపాడాల్సిన అధికారులే ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారు. వాటర్ వర్క్స్ విభాగంలో ఏకంగా మూడు కోట్ల రూపాయల మేర గోల్‌మాల్ జరిగినట్లు సంచలన నిజాలు బయటకు వస్తున్నాయి. కమర్షియల్ కనెక్షన్ల పేరుతో లక్షలాది రూపాయల డిపాజిట్లు వసూలు చేసి, ఆ సొమ్మును ప్రభుత్వ ఖాతాకు కాకుండా సొంత ఖాతాలకు మళ్లించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**కమర్షియల్ కనెక్షన్ల మాయాజాలం:**
హోటళ్లు, లాడ్జీలు, ఆసుపత్రుల వద్ద లక్షల్లో డిపాజిట్లు వసూలు చేసిన అధికారులు.. వాటిని ఆన్‌లైన్ రికార్డుల్లోకి ఎక్కించకుండా గోప్యంగా ఉంచారు.
గతంలోనే ఈ అక్రమాలపై అనేక కథనాలను ప్రసారం చేయడంతో.. దిద్దుబాటు చర్యలకు దిగిన అధికారులు 228 అక్రమ కనెక్షన్లను తొలగించారు. కానీ ఆ సొమ్ము ఏమైందనే దానిపై ఇప్పటికీ నీలి నీడలు కమ్ముకున్నాయి.

**బదిలీ భయం.. బయటపడుతున్న నిజాలు:**
ఈ కుంభకోణంలో కీలక సూత్రధారిగా భావిస్తున్న ఓ కింది స్థాయి ఉద్యోగి బదిలీ అవుతుండటంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. తమ వద్ద డబ్బు వసూలు చేసి ఇప్పుడు మళ్లీ కట్టమంటున్నారని బాధితులు అధికారులను నిలదీస్తున్నారు.
విచారణ ఎక్కడ: అధికారుల వద్ద పూర్తి ఆధారాలు ఉన్నా.. విచారణలో ఎందుకు జాప్యం చేస్తున్నారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

# గ్రామస్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందం

**..“వన్ మంత్‌వన్ విలేజ్‌ఫోర్ విజిట్స్” కార్యక్రమం అమలు.**

**..ప్రతి గురువారం ఒకే గ్రామంలో అధికారులు పర్యటనలు.**

**..నాలుగు విడతల్లో సమస్యల స్వీకరణ నుంచి పరిష్కారం వరకు చర్యలు.**

**..రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 06:** ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వేగవంతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుండి టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా రెవెన్యూ సంబంధిత సమస్యలను గ్రామస్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా “వన్ మంత్ – వన్ విలేజ్ – ఫోర్ విజిట్స్” కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కింద ప్రతి గురువారం రోజున ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, అదే గ్రామాన్ని నెలలో నాలుగు వారాల పాటు అధికారులు సందర్శించాలని కలెక్టర్ సూచించారు. ఈ బృందంలో తహసీల్దార్, ఎంపీడీఓ, వీఆర్ఓ, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, మండల సర్వేయర్, పంచాయతీరాజ్ విభాగం ఏఈ, సాగునీటి శాఖ అధికారులు, అవసరమైతే అటవీ శాఖ అధికారులు పాల్గొని గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
ప్రజలకు తక్షణ సేవలు అందించడం, పెండింగ్ ఫిర్యాదులను తగ్గించడం, వివాదరహిత గ్రామాల నిర్మాణం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి మండలంలో ప్రతి నెల ఒక రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేసి నాలుగు విడతలుగా కార్యక్రమాన్ని అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. మొదటి విడతలో గ్రామంలో ఫిర్యాదుల స్వీకరణ, రికార్డుల ప్రదర్శన, సాధారణ సమస్యల పరిష్కారం చేపట్టాలి. రెండో విడతలో ఫీల్డ్ స్థాయి పరిశీలనలు నిర్వహించి వినతులపై విచారణ చేయాలి. మూడో విడతలో సమస్యల పరిష్కారం, ఆదేశాల జారీ, మ్యూటేషన్లు వంటి చర్యలు తీసుకోవాలి. నాలుగో విడతలో గ్రామ సభ నిర్వహించి పరిష్కరించిన అంశాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.
భూమి హక్కుల నమోదు, వెబ్‌ల్యాండ్ సమస్యలు, సర్వే నంబర్లలో పొరపాట్లు, సరిహద్దు వివాదాలు, మార్గ హక్కుల సమస్యలు, కుటుంబ భూ వివాదాలు, ఆక్రమణలు, ఖాతా మార్పిడి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అందిన అన్ని ఫిర్యాదులను పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి, సమయపాలనతో పరిష్కరించాల్సిందిగా సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని, ప్రతి వారం కార్యక్రమ పురోగతిని స్వయంగా సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదుల నమోదు, పరిష్కారాన్ని ట్రాక్ చేస్తూ పారదర్శకతను మరింత పెంచుతామని పేర్కొన్నారు. మే 2026 నుండి ప్రతి నెల మొదటి నుండి నాలుగవ గురువారాల వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తూ, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. నిరంతర పర్యవేక్షణతో పారదర్శక పాలన అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

# పుట్టుపల్లి దళితుల సాగు భూములకు.. అటవీ శాఖ ఆటంకాలు తొలగించాలి.

**..32 ఏళ్లుగా సాగులో ఉన్నా పట్టాలు ఇవ్వకుండా వేధింపులు అన్యాయం.**

**..డిఆర్ఓ రాము నాయక్ కు సిపిఐ ఆధ్వర్యంలో బాధితుల విన్నపం.**





**ఆంధ్ర ప్రగతి మహానంది మే 06:**మహానంది మండలం బుక్కాపురం పంచాయతీ పరిధిలోని పుట్టుపల్లి మజరా గ్రామానికి చెందిన 32 దళిత కుటుంబాలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములపై అటవీ శాఖ అధికారులు సాగిస్తున్న వేధింపులను వెంటనే నిలువరించాలని, వారికి తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం నాడు జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ ను కలిసి పుట్టుపల్లి గ్రామ బాధితులతో కలిసి వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా రంగా నాయుడు మాట్లాడుతూ పుట్టుపల్లికి చెందిన 32 పేద దళిత కుటుంబాలు గత 32 సంవత్సరాలుగా కృష్ణనంది దేవస్థానం సమీపంలోని తెలుగు గంగ ప్రధాన కాలువ వద్ద గల సర్వే నెంబర్లు 681, 797, 798, 799, 800, 809, 810 లలో ఉన్న సుమారు 87.31 ఎకరాల బంజరు భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. 1992 నుండి ఆ భూమిలో అరటి పంట పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఆ భూమి తప్ప వారికి మరో జీవనాధారం లేదని వివరించారు. ఈ భూమిపై గతంలోనే అనేక అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయని, 24.10.1995న అప్పటి మహానంది తహశీల్దారు (ఆర్.సి.బి/826/95) ఈ భూమిని పేద దళితులకు రైతువారీ పట్టాలుగా ఇవ్వవచ్చని జిల్లా కలెక్టరుకు నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే 22.02.1996న నంద్యాల సబ్ కలెక్టరు (ఆర్.సి.బి./2760/95) ఈ భూమిని జె.ఎఫ్.యం. పథకం కింద దళితులకు కేటాయించాలని డివిజనల్ ఫారెస్ట్ అధికారిని ఆదేశించారని తెలిపారు.అనంతరం 25.11.1997న వి.ఎ.ఓ, పోలీసులు, ఫారెస్టు అధికారులు సంయుక్తంగా నిర్వహించిన పంచనామాలో.. ఈ భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ‘రెవెన్యూ భూమి’ గానే ఉన్నట్లు, జి.ఓ.యం.యస్. నెం. 278 ప్రకారం ఫారెస్టు శాఖకు బదిలీ అయినట్లు ఎటువంటి రికార్డులు లేవని స్పష్టంగా పేర్కొన్నారని నాయకులు వివరించారు. అప్పట్లో అనంతపురం శాసనసభ్యులు కె. రామకృష్ణ సైతం 18.09.1997న అప్పటి రెవెన్యూ శాఖా మంత్రి దేవేందర్ గౌడ్ కు ఈ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారన్నారు.
దళితులపై అటవీ శాఖ బనాయించిన అక్రమ కేసులను (సి.సి.నెం. 253/98) నంద్యాల జె.యం.ఎఫ్.సి. కోర్టు 23.01.2002న కొట్టివేస్తూ తీర్పునిచ్చిందని, అలాగే 16.10.2008న మరో కేసులో (సి.సి.నెం. 537) కూడా దళితులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ, గత మే 4వ తేదీన ఫారెస్టు అధికారులు గ్రామంలో దండోరా వేయించి, అరటి పంటను ధ్వంసం చేస్తామని, పొలాలను ఖాళీ చేయాలని బెదిరించడం దారుణమన్నారు. అధికారుల దుందుడుకు చర్యలతో పేదలు భయాందోళనలకు గురవుతున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి 87.31 ఎకరాల భూమిని సర్వే చేయించి శాశ్వత పట్టాలు ఇవ్వాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, సిపిఐ మండల కార్యదర్శి ఆర్. సామేలు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సోమన్న, సిపిఐ సీనియర్ నాయకులు బి. సంజీవులు, పుట్టుపల్లి గ్రామ దళిత బాధితులు పాల్గొన్నారు.

# సురేఖ మెటర్నటీ చిల్డ్రన్ హాస్పిటల్ గుర్తింపును రద్దు చేయాలి.

**.. డాక్టర్ సునీల్ కుమార్ రాజు పై కఠిన చర్య తీసుకోవాలి.**

**.. పాప తల్లిదండ్రులకు సహాయం అందించాలి. ..సిపిఐ మండల కార్యదర్శి శివయ్య.**



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె మే 06:** బనగానపల్లె పట్టణంలో ఉన్నటువంటి సురేఖ మెటర్నటి& చిల్డ్రన్స్ హాస్పిటల్ లొ వైద్యుల నిర్లక్ష్యానికి 8 నెలల చిన్న పాప శ్రీ సత్య మరణానికి కారణం అయింది జలుబు చేసిందని తీసుకొని పాప తల్లిదండ్రులు పసుపల గ్రామానికి చెందిన కమలహాసన్.. నాగేశ్వరి.హాస్పిటల్కు తీసుకురడం జరిగింది. శ్రీ సత్య కు జలుబు & దగ్గు వైద్యం కోసం డాక్టర్ సునీల్ కుమార్ రాజ్దగ్గరికి వచ్చి చూపించడం జరిగింది. డాక్టర్ పాపకి మూడు ఇంజక్షన్స్ వేయడం తో డోస్ ఎక్కువ అయి వికటించడం తో మూడు సెకండ్ల సమయంలోనే పాప శ్రీ సత్య అపస్థితిలోకి వెళ్లిపోవడం జరిగింది.ఈ డాక్టర్ గమనించి పాప ను నంద్యాల హాస్పిటల్కి తీసుకెళ్ళమని అంబులెన్స్ ను డాక్టర్ సునీల్ కుమార్ రాజు పిలిపించి తను కూడా అంబులెన్స్ లో వెళ్లడం జరిగింది. తర్వాత నంద్యాల డాక్టర్ ప్రాణంతో లేదని తెలపడం జరిగింది. కావున ఈ పాప ప్రాణాలకు డాక్టర్ సునీల్ కుమార్ రాజ్ బాధ్యులు కాబట్టి ఇతని పైన కఠినచర్యలు తీసుకోవాలి పాపకు ఇచ్చిన మందులు ఏ కంపెనివి నకిలివా లేదా ఎక్స్పైరీ డేట్ అయినవ వీటి పైన జిల్లా వైద్య అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి ఈ చర్యకు బాధ్యులైన హాస్పిటల్ యాజమాన్యానికి డాక్టర్ పై చర్యలు తీసుకోవాలి. సురేఖ హాస్పిటల్ పర్మిషన్ రద్దు చేయాలి. ఎన్నో రోజులుగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా చెప్తానే వున్నాము నాణ్యతలేని డాక్టర్లు మెడికల్ మాఫియా విచ్చలవిడిగా జరుగుతా ఉంది అని ఎన్నోసార్లు జిల్లా వైద్య అధికారులకు మీడియా ద్వారా తెలియ జెయడం జరిగింది. కాని వారికీ చీమ కుట్టినట్లు కూడాలేదు తక్షణమే జిల్లా వైద్యాధికారులు అందించి తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని సిపిఐ బనగానపల్లె మండలం కార్యదర్శి శివయ్య డిమాండ్

# 2026- పాలీసెట్ ఫలితాలలో మేఘనా కోచింగ్ సెంటర్ విద్యార్థుల ప్రభంజనం.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 06:** మేఘన కోచింగ్ సెంటర్ నుంచి 196 మంది విద్యార్థులు కోచింగ్ తీసుకోగా 191 మంది విద్యార్థులు అర్హత సాధించారు, 99% మంది విద్యార్థులు పాలీసెట్ అర్హత సాధించారు. కే సురేష్ కుమార్ హాల్ టికెట్ నెంబర్ (6511272)- 120 మార్కుల గాను 113 మార్కులు సాధించి స్టేట్ లెవెల్ లో 658 ర్యాంక్ సాధించాడు, అదేవిధంగా 2. కే శ్రీవల్లి – హాల్ టికెట్ నెంబర్– (6611059), 120 మార్కుల గాను 90 మార్కులు సాధించి స్టేట్ లెవెల్ లో 5798 ర్యాంక్ . 3. మోహన్ గౌడ్ –హాల్ టికెట్ నెంబర్ –6611129 120 మార్కుల గాను 87 మార్కులు సాధించి స్టేట్ లెవెల్ లో 6739 ర్యాంక్....4. కే. భార్గవ్ రెడ్డి హాల్ టికెట్ నెంబర్–6561009.120 మార్కుల గాను 82 మార్కులు సాధించి స్టేట్ లెవెల్ లో 9293 ర్యాంక్ , ఇదేవిధంగా 5000 లోపు 10 మంది విద్యార్థులు 10 వేల లోపు 23 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం జరిగింది. ఈ ర్యాంకులు సాధించడానికి కృషిచేసిన మా అధ్యాపక బృందమైన శివ కి, విష్ణు కి, జమాల్ కి, వంశి కి, విజయకి, నరేష్ కి ,కోచింగ్ సెంటర్ డైరెక్టర్. సి ఆర్.జయ సింహారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు, అదేవిధంగా ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు కోచింగ్ సెంటర్ డైరెక్టర్. సీ ఆర్.జయ సింహారెడ్డి మెమొంటో లతో సత్కరించారు. ఈ ర్యాంకులు సాధించడానికి కృషిచేసిన అధ్యాపక బృందానికి మరియు విద్యార్థిని విద్యార్థులకు నా ప్రత్యేక శుభాకాంక్షలు, అందరికీ నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

# నంద్యాలలో ఆధునిక విద్యకు చిరునామా.. శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్.!

**-గ్రామీణ విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్థాయి విద్య.**

**..అంతర్జాతీయ ప్రమాణాలు.**

**-భారతీయ విలువలతో విద్యాభివృద్ధి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 06:** నంద్యాల జిల్లా గోస్పాడు మండలం దీబగుంట్ల సమీపంలోని బాబా నగర్‌లో స్థాపించబడిన శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్,గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల విద్యను అందిస్తూ ప్రత్యేక గుర్తింపును సంపాదిస్తోంది.“హాముతీఅ ూాజూజూశ్రీఎ ూాముఎ”, Built for Brilliance Designed for Destiny’ వంటి సిద్ధాంతాలతో విద్యార్థుల్లో జ్ఞానం మాత్రమే కాకుండా ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతోంది. విస్తారమైన,పచ్చని పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఈ క్యాంపస్‌లో అడ్మినిస్ట్రేటివ్,అకాడెమిక్,రెసిడెన్షియల్ బ్లాక్‌లు,మెస్,స్టాఫ్ క్వార్టర్స్ వంటి సమగ్ర సదుపాయాలు ఉన్నాయి.ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకునేలా ప్రత్యేకంగా రూపకల్పన చేసినట్లు యాజమాన్యం పేర్కొంది. పాఠశాలలో విస్తృతమైన తరగతి గదులు,స్మార్ట్ డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు,ఆధునిక లైబ్రరీ,నాలెడ్జ్ హబ్, స్టీమ్ ఆధారిత ల్యాబ్‌లు ఏర్పాటు చేయబడ్డాయి.విద్యార్థులలో కమ్యూనికేషన్,లీడర్‌షిప్ నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.చిన్నారుల కోసం ప్రత్యేక ప్లే ఏరియా క్రీడలు,ఫిట్‌నెస్ కార్యకలాపాలు కూడా నిర్వహిస్తున్నారు.చైల్డ్–సెంట్రిక్ విధానంతో బోధన కొనసాగిస్తూ,హోలిస్టిక్ ఎడ్యుకేషన్,బహుభాషా నైపుణ్యాలు,జీవన నైపుణ్యాలు,రెగ్యులర్ అసెస్‌మెంట్స్,ఇన్‌క్లూజన్,ఎంట్రప్రెన్యూర్షిప్ అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పాఠశాల కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.
ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ హెల్త్ ఫోకస్డ్ క్యాఫెటీరియా,ఇన్‌ఫర్మరీ బేలో డాక్టర్ ఆన్ కాల్ సేవలు, పీరియాడిక్ హెల్త్ చెకప్‌లు నిర్వహిస్తున్నారు.భద్రతతో కూడిన రెసిడెన్షియల్ సదుపాయాలు తల్లిదండ్రులకు విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి.అకడమిక్ పరంగా కేజీ నుంచి 8వ తరగతి వరకు సీబీఎస్సీ సెమీ–రెసిడెన్షియల్,రెసిడెన్షియల్ విధానం,అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టేట్ బోర్డ్ రెసిడెన్షియల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.రవాణా కోసం బస్ సౌకర్యం కూడా కల్పించారు.పాఠశాల ఛైర్మన్ డా.పి.దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులకు నగర స్థాయి విద్య అందించడమే తమ లక్ష్యమని,భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. నంద్యాల జిల్లాలో నాణ్యమైన విద్యకు కొత్త దిశగా నిలుస్తున్న ఈ విద్యాసంస్థకు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# ప్రభుత్వ కార్యాలయాలే కానీ

## వ్యాపారస్తులకు గృహస్థులకు డంపింగ్ యార్డ్.!




కార్యాలయం ఆవరణలో చెత్త చేదరాలతో పాటు పనికి రాని మామిడి పండ్లు ను పడవేసిన వైనం




కబ్జా చేసి సచివాలయం గోడకు ప్రైవేటు వ్యక్తి భవనానికి మధ్యలో గోడ కటి లెట్రిన్ బాత్రూమ్ కట్టిన వైనం

**.పట్టించుకోని అధికారులు.**

**..కబ్జలకుగురివుతున్న స్థలాలు**

**-చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు.**

**దుర్గంద భరితంలమధ్య ప్రభుత్వకార్యాలయాలు.**

**..వెలుగోడు ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో లొ ఉన్న ఖాళీ గా ఉన్న స్థలంలో పార్క్ ను ఏర్పాటు చేయాలి.**

**ఆంధ్ర ప్రగతి వెలుగోడు మే 06:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలుఅధికారుల ద్వారా నిర్వహిస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కుడా అధికారుల మాటలు పేడ చెవిన పెట్టి, గృహస్థులు, వ్యాపార సంస్థలవారు. చెత్త చేదరాలను ఏనాడూ లేని కొత్త ఆచారానికి తెరలేపి, ప్రభుత్వ కార్యాలయాల మధ్యన తీసుకోవచ్చి పడ వేస్తున్నారు. వెలుగోడు మేజర్ గ్రామ పంచాయతీ వారు రోజు ఉదయానే పారిశుధ్య కార్మికులను పెట్టి చెత్త బండ్లు, వాహనాలు పెట్టుతున్న కుడా చెత్తను తెచ్చి, కార్యాలయాల మధ్య న వేస్తున్నారు. ఇది ఇలాఉంటే గతంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న స్థలం రాజుల కోట, తరువాత కాలంలో బ్రిటిష్ తెల్లదోరలు ఇక్కడ కు వచ్చి నప్పుడు ఈ స్థలాని వారి అధీనం లొ ఉంచుకొని అక్కడ ఒక అతిథి గృహని నిర్మించుకొని వారియొక్క కార్య క్రమాలను నిర్వహించారు. తదన్నంతరం నల్లదోరల పాలనలో సదరు స్థలానికి, వారు నిర్మిచిన అతిథి గృహని వదలి పోయినాక,రోడ్డు రవాణా సంస్థ అధీనంలోరాష్ట్ర ప్రభుత్వం ఆపగించిశీది అప్పట్లో (వాచి మెన్ )సంరక్షణ దారుని ఏర్పాటు చేసి నాయకులు, మంత్రులు, ఇక్కడ కు వచ్చిపోయే వారు. తరువాత ఎన్ టి రామారవు,(టి డి పి )అధికారంలొ వచ్చిన తరువాత వెలుగోడులో తెలుగు గంగా ప్రాజెక్ట్ ఏర్పాటు చేసినాకా రాజకోటకు చెందిన స్థలం లొ ,నీటి పారుదల శాఖ కార్యాలయాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి అక్కడ ఉన్న ఖాళీ స్థలం ను,అతిది గృహని వారి సంరక్షణలోచేర్చారు. అక్కడ కాపలాదారులను పెట్టి ఎట్టు వంటి అక్రమణలకు,చొరబాట్టులకు తావు లేకుండా గా చూసుకొన్నారు అధికారులు. పట్టణంలొ రెవెన్యూ కార్యకలాపాలనిర్వహణకు, అక్కడ తహసీల్దార్, మండల అభివృద్ధి, ఐ. కే. పి., టి. జి. పి., జాతీయ ఉపాధిహామీపథకం కార్యాలయం, రైతు భరోసా కేంద్రం, సచ్చి వాలయాలు, మండలస్థా యి అధికారులు ఇక్కడ నుండి మండల ప్రజాపాలన విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయ నిర్మాణాలకు కావలిసిన భూమిని కుడా ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాలతో నే ఇచ్చారు. కాని గత శీ లొ ఉన్న తెలుగు గంగా అధికారులు వాచ్మెన్ లను పెట్టి బంగ్లా స్థలం లొ ఏటువంటి చెత్త చేదరాలను వేయనియకుండా చేసేవారు. అయితే తెలుగు గంగా డి ఈ కి వాచ్ మెన్ గా పనిచేసే అధికారి మధ్య భేదాబి ప్రాయాలు రావడం తో అతను, కట్ట మీద కపలాగా పోవడంతో కార్యాలయాల అవరణం లలో గృహ నివాసులు, వ్యాపారాల నిర్వాహకులు, చెత్త చెదరాలను తీసుకోనివచ్చి వేయడం తో డంపింగ్ యార్డ్ మాదిరిగా మారింది. అంతే కాకుండా, హోటలలో పనిచేసే కార్మికులు మరియు బయటి వ్యక్తులు, కార్యాలయ పరిశ్రాలలో మల, మూత్ర విసర్జనలు చేస్తున్నారు. అంతే కాదు మృత కళేబరాలు (కుక్కలు, పిల్లుచని పోతే )వాటినికూడా ఇక్కడే పడేస్తుంటారు. గత ప్రభుత్వం లొ సచివాలయాలనిర్మాణంలో కొంత స్థలాని ప్రైవేటు వ్యక్తుల స్థలం వైపు వదిలితే అదికూడా అక్రమంగా కలుపు కుంటున్నారు. ఒక్క వ్యాపార సంస్థ నిర్వాహకుడు ఏకంగా అతని స్థలం వైపు ఉన్న కొంత ప్రభుత్వ స్థలాని కి అక్రమిశీచ్చి, నాల్గవ సచివాలయ గోడకు, తన బహుళ అంతస్తూ గోడకు పారును కట్టి మరుగు దోడి, మూత్ర శాలను నిర్మించుకొనాడు అక్కడి వెస్ట్ నీరు తెలుగు గంగా కు చెందిన ప్రభుత్వ స్థలం లోనే ప్రవహిస్తున్న, కుడా అధికారులు మాత్రం చూసి చూడనట్టు గా వ్యవహిరిస్తుడటం పై ప్రజాసంఘాలనాయకులు, మేధావులు విమర్శ లు గుపిస్తున్నారు. మండలంలో ముఖ్యమైన విభాగం రెవెన్యూ, అందులో మండల ఫస్ట్ మేజిస్ట్రేట్, తహసీల్దార్, మండల అభివృద్ధిలో కీలక మైన అధికారి యం పి డి ఓ, మరియు నీటి పారుదల శాఖ అధికారులు, నిత్యం ఇటు విపునుండే వస్తు పోతు ఉంటారు. మరి ఈ అధికారులకు ఇవి కనిపించవ, అన్ని మేధావుల వర్గం ముక్కు నవేలువేసుకుంటున్నారు. కావున ఉమ్మడి జిల్లా ఉన్నత అధికారులు ఇక్కడ జరుగు తున్న అక్రమణలపై,దృష్టి సారించాలని, తెలుగు గంగా కార్యాలయం ఆవర్ణ లొ ఉన్న మిగులు ప్రభుత్వ పోరం బోకు స్థలంలో, వెలుగోడు గ్రామ మేజర్ పంచాయతీలొ ఉన్న సుమారు ముపై వేల కు పై ఉన్న జనాభాకు కనీసం ఒక్క పార్కు లేదని, వృద్దులు, అవిశ్రాంత ఉద్యోగులు సేదతీరాటానికి యువకులు, స్త్రీలు వ్యాయ్య యం చేసుకోవడానికి కాలినడక చేసుకోటానికి ఉన్న స్థలం ను కేటాయించాలని, గ్రామ ప్రజలు, మరియు యువకులు, స్త్రీలు, వృద్దులు, కోర్తున్నారు. ఈ విషయం పై శ్రీశైలం నియోజక వర్గం శాశన సభ్యులు కుడాప్రత్యేక దృష్టిని సారించాలని వెలుగోడు గ్రామ ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

# విజయ్ కు షాక్ ఇవ్వబోతున్న

# డీఎంకే అన్నాడీఎంకే.?

**.. ప్రభుత్వ ఏర్పాటు దిశగా ఇరు పార్టీల చర్చలు.**

**- ..అధికారమే అంతిమంగా ఇరు పార్టీల వ్యూహాలు. .. సంఖ్యా బలం లేదని విజయ్ సీఎం ప్రమాణ స్వీకారం రద్దు.**

**ఆంధ్ర ప్రగతి అమరావతి మే 06:**
తమిళనాడు రాజకీయాలు ఒక అంతుచిక్కని మలుపు తిరిగాయి. దశాబ్దాలుగా బద్ధశత్రువులుగా ఉన్న డీఎంకే మరియు అన్నాడీఎంకే లు చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాయనే వార్త దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా తమిళ సూపర్ స్టార్ విజయ్ స్థాపించిన టీవీకే పార్టీని అధికారానికి దూరంగా ఉంచడమే లక్ష్యంగా ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులో మారుతున్న పరిణామాల ప్రకారం, డీఎంకే మరియు అన్నాడీఎంకే తమ విభేదాలను పక్కన పెట్టి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ రెండు పార్టీల ఎమ్మెల్యేలతో పాటు, వారి మద్దతుదారుల సీట్లను కలిపితే మొత్తం సంఖ్యాబలం 121కి చేరుతుంది. ఇది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ కంటే ఎక్కువ. అయితే, ఈ కూటమిలో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. ప్రస్తుత ఎన్నికల్లో స్టాలిన్ ఓటమి పాలవడంతో, అనుభవం ఉన్న నాయకుడిగా ఎడప్పాడి పళనిస్వామి మరోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.



**లివిజయ్ విజయానికి అడ్డుకట్ట వేసే వ్యూహంలి**

తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్‌కు మేజిక్ ఫిగర్ సాధించే అవకాశం ఇవ్వకుండా, సంప్రదాయ ద్రవిడ పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. విజయ్ వంటి కొత్త శక్తి అధికారంలోకి వస్తే రెండు ప్రధాన పార్టీల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని భావించిన అగ్రనేతలు, ఈ మేరకు ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ వింత పొత్తు గనుక నిజమైతే, తమిళనాడు రాజకీయ చరిత్రలో ఇది ఒక అరుదైన మరియు ఊహించని అధ్యాయంగా మిగిలిపోతుంది.

**ఇది సాధ్యమేనా?**

అయితే, ఈ ప్రచారాన్ని కొందరు రాజకీయ విశ్లేషకులు కొట్టిపారేస్తున్నారు. పరస్పర విరుద్ధ ధ్రువాలైన డీఎంకే మరియు అన్నాడీఎంకేలు కలవడం అనేది సిద్ధాంతపరంగా దాదాపు అసాధ్యమని వారు వాదిస్తున్నారు. ఒకవేళ కేవలం అధికారం కోసమే కలిసినా, క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలు దీనిని అంగీకరించడం కష్టమని, ఇది పార్టీల మనుగడకే ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. ఏదేమైనా, తమిళనాట ప్రస్తుత పరిస్థితులు రోజుకో మలుపు తిరుగుతుండటంతో, అంతిమంగా ముఖ్యమంత్రి పీఠం ఎవరిని వరిస్తుందనేది ఇప్పుడే చెప్పలేమని, మరికొద్ది రోజులు వేచి చూడాలని వారు అభిప్రాయపడుతున్నారు. తమిళనాడు రాజకీయ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యంత నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. దశాబ్దాలుగా ఎప్పుడూ శత్రువులగా ఉండే డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు తమ బద్ధ వైరాగ్యాన్ని పక్కన పెట్టి పొత్తు దిశగా అడుగులు వేస్తున్నాయనే వార్త ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తలపతి విజయ్ నేతృత్వంలోని ‘తమిళగ వెట్రి కజగం‘ పార్టీని అధికార పీఠానికి దూరంగా ఉంచడమే ఏకైక లక్ష్యంగా ఈ రెండు ద్రవిడ పార్టీల మధ్య చర్చలు సాగుతున్నట్లు ‘ఇండియా టుడే’ తన కథనంలో వెల్లడించింది. ప్రస్తుత అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118 కాగా, విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 107 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ తన 5 మంది ఎమ్మెల్యేల మద్దతును విజయ్‌కు ప్రకటించడంతో ఆయన బలం 112కి చేరింది. అయితే మెజారిటీకి ఇంకా ఆరుగురు ఎమ్మెల్యేల మద్దతు విజయ్‌కు అనివార్యంగా మారింది. ఈ పరిస్థితుల్లో విజయ్ బలాన్ని నిరూపించుకోకముందే.. 59 స్థానాలు గెలిచిన డీఎంకే, 47 స్థానాలు గెలిచిన అన్నాడీఎంకే కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై మంతనాలు జరపడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. వ్యూహాత్మకంగా ఈ రెండు పార్టీలు కలిస్తే వారి సంఖ్యాబలం 106కి చేరుతుంది. అయితే స్వతంత్రులు, చిన్న పార్టీలు లేదా లెఫ్ట్ పార్టీలను కలుపుకుని విజయ్‌కు చెక్ పెట్టాలని ద్రవిడ నేతలు భావిస్తున్నట్లు సమాచారం. దశాబ్దాలుగా సిద్ధాంతపరంగా, వ్యక్తిగతంగా తలపడ్డ ఈ పార్టీలు.. విజయ్ రూపంలో ఒక కొత్త శక్తి ఉద్భవించడాన్ని తమ ఉనికికే ప్రమాదంగా భావిస్తున్నాయి. ఒకప్పుడు ఒకే చెట్టు నుంచి పుట్టిన ఈ రెండు పార్టీలు ఇప్పుడు మళ్ళీ అధికారం కోసం ఏకమవుతాయా అన్నది ఉత్కంఠ రేపుతోంది.

## మహిళల భద్రతే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా

# అవగాహన కార్యక్రమాలు.

**..శక్తి యాప్ నీ చెంత ఉంటే.... మీరు పోలీసుల రక్షణలో ఉన్నట్లే.**

**..కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండండి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 06:**



మహిళలు చిన్నారుల భద్రత మరియు శక్తి యాప్ ప్రయోజనాలపై నంద్యాల జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు జిల్లాలోని పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ ల పరిధిలోని వివిధ గ్రామాలలో మహిళల భద్రత, శక్తి యాప్ వలన కలిగే ప్రయోజనాలు ,సైబర్ క్రైమ్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్యవివాహాలు, కొత్త చట్టాలు మొదలగు వాటిపై ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుంది.
ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, చిన్నారుల రక్షణ కొరకు శక్తి యాప్ ను రూపొందించడం జరిగిందని కావున మహిళలు వారి యొక్క సెల్ ఫోన్లలో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఆపద సమయంలో పోలీసులు మీ చెంత ఉన్నట్లేనని తెలియజేస్తూ శక్తి యాప్ ప్రయోజనాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది.
అంతేకాక జిల్లా ఎస్పీ నంద్యాల జిల్లా వ్యాప్తంగా శక్తి టీం బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బృందాలు ముఖ్యమైన కూడలలో షాపింగ్ కాంప్లెక్స్ లలో నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలలో సంచరిస్తూ మహిళల రక్షణ కొరకు గస్తీ నిర్వహించడంతో పాటు ఉచితంగా అవగాహన కల్పించడం జరుగుతుంది. అంతేకాక సైబర్ క్రైమ్ నేరాలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, రోడ్డు ప్రమాదాలు నివారణ, బాల్య వివాహాల నివారణ, పోక్సో కేసులు, మహిళలపై చిన్న పిల్లలపై నేరాలు మరియు కొత్త చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది.
అంతేకాక అత్యవసర సమయంలో ఉపయోగించవలసిన టోల్ ఫ్రీ హెల్ప్లైన్ ఖుఅశ్రీ 100, 112, 1930,1972, నంబర్ల గురించి కూడా అవగాహన కల్పించారు.
అంతేకాక ఎవరైనా మీ చుట్టుపక్కల ప్రదేశాలలో అనుమానాస్పదంగా సంచరించిన లేదా ఏదైనా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న అట్టి వారి వివరాలు ప్రతి పౌరుడు మీ బాధ్యతగా పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని పోలీస్ అధికారులు తెలియజేశారు.

## మహిళా బిల్లు ఓడించామని సంబరాలు చేసుకున్న పార్టీలకు ఓటుతో బుద్ధిచెప్పారు.

**..నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 06:**
ఇటీవల పార్లమెంట్ లో మహిళా బిల్లు ఓడించామని సంబరాలు చేసుకున్న డి ఎం కె, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటు అనే చెప్పుతో కొట్టి ఓడించి మహిళలే బుద్ధి చెప్పారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల నూనెపల్లె మార్కెట్ యార్డు ఆవరణలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయం నిర్మాణంకు ఘనంగా భూమి పూజ చేశారు.
ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెడితే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు దక్కకూడదు అన్న దురుద్దేశ్యంతో కాంగ్రెస్, వాటి అనుబంధ కూటమి డి ఎం కె, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలు మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ లో తీవ్రంగా వ్యతిరేకించి బిల్లు ఓడిపోవడానికి కారణం అయ్యాయని, మహిళా బిల్లు ఓడించామని పార్లమెంట్ లోనే సంబరాలు చేసుకున్న కాంగ్రెస్, డి ఎం కె, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలకు ఆనాడే చెప్పాను మీకు తగిన గుణపాఠం తప్పదని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు ఓటు అనే చెప్పుతో కొట్టి ఓడించి బుద్ధి చెప్పారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. రాబోవు ఆరు నెలల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టి ఆమోదం పొంది మహిళలకు ఇచ్చిన హామీ మేరకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్న ధీమా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వ్యక్తం చేశారు.

## బేతంచెర్లలోరాయితీపై వ్యవసాయ పనిముట్ల కొరకు దరఖాస్తు చేసుకోండి

**- ఏ ఓ విజయ కుమార్ రెడ్డి**

**బేతంచెర్ల మే 6 ఆంధ్ర ప్రగతి**
బేతంచెర్ల మండలం -వ్యవసాయ యాంత్రీకరణ లో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు ఈ నెల 5 వ తేదీ నుండి 19 వ తేదీ వరకు రైతులు ంవవం .ap .gov .in /FM nqT website నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ట్రాక్టర్లు ,మినీ ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, బేలర్లు, టైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ దుక్కు, దమ్ము సెట్లు, రోటవేటర్లు, పవర్ వీడర్లు ,పవర్ టిల్లేర్లు, తదితర వ్యవసాయ పనిముట్లు రాయితీతో రైతులకు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. చిన్న, సన్న కారు రైతులు,మహిళా రైతులు, SC ,ST రైతులకు 50 శాతం సబ్సిడీతో మరియు ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో ూహీూవీ పథకం కింద వ్యవసాయ యాంత్రీకరణ అందించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ భూమి కలిగి లేదా ROR భూమి కలిగిన రైతులు మాత్రమే అర్హులు. 2024-25 సంవత్సరానికి సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలను పొందిన రైతు కుటుంబాలు అనర్హులు, దరఖాస్తు చేసుకున్న రైతులకు లాటరి పద్దతి ద్వారా జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఎంపిక చేస్తారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసులోవాలని ఏవో కోరారు. మరింత సమాచారం కొరకు స్థానిక రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించవలసిందిగా మండల్ వ్యవసాయ అధికారి తెలిపారు.

# కళారాధన సేవలు ప్రశంసనీయం.!

## -రాష్ట్ర న్యాయం మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్.

..“కళా సాధన“ లలిత కళల వేసవి శిక్షణ శిబిరం కరపత్రాలు ఆవిష్కరించిన మంత్రి ఫరూక్.

..25 సంవత్సరాలుగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమం: కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు.

..300 మంది పైగా విద్యార్థులకు నెల రోజులు లలిత కళల ఉచిత శిక్షణ శిబిరం: కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ.

..డాక్టర్ రవి కృష్ణ కళా సేవలను అభినందించి శాలువతో సత్కరించిన మంత్రి ఫరూక్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 06:**
కళారాధన సాంస్కృతిక సంస్థ ప్రతిఏటా మే నెలలో కళా సాధన పేరిట నిర్వహించే ఉచిత లలిత కళల శిక్షణ శిబిరం కరపత్రాలు, పోస్టర్స్ రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ నిర్వహణలో జరిగింది.

ఈ కార్యక్రమంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. కళారాధన సాంస్కృతిక సంస్థ గత 25 సంవత్సరాలుగా విద్యార్థులకు వేసవిలో ఉచితంగా లలిత కళలలో శిక్షణ ఇవ్వడమే కాకుండా వారితో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నారని, ఆగస్టులో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని వేలాది విద్యార్థులకు అనేక అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి వారిలో ఉన్న సృజనాత్మక శక్తుల్ని గుర్తిస్తున్నారని, అనేక పద్య, సాంఘిక, బాలల నాటకాలు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వ నంది ఉత్సవాలలో, రాష్ట్రవ్యాప్తంగా పరిషత్తులలో ప్రదర్శించి వందలాది బహుమతులు తీసుకువచ్చి నంద్యాల కళా వైభవాన్ని రాష్ట్ర, దేశవ్యాప్తంగా తీసుకువెళ్లారని ప్రశంసించారు.

ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నెలరోజుల ఉచిత శిక్షణ తర్వాత జూన్ రెండవ తేదీ ఎన్టీఆర్ పురపాలక టౌన్ హాల్లో శిక్షణ పొందిన వారి చేత ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని



తెలిపారు. విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ డాక్టర్ రవి కృష్ణ కళా రంగానికి చేస్తున్న సేవలను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహమ్మద్ రఫీ, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి,ఐఎంఏ మహిళ విభాగం వైద్యులు డాక్టర్ మాధవి, డాక్టర్ వసుధ ,డాక్టర్ నర్మద,డాక్టర్ శైలజ, డాక్టర్ లలిత, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శులు అన్నెం శ్రీనివాసరెడ్డి, రంగనాథ్, సాహితీ విభాగం కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, శిక్షణ శిబిరం కోచ్ లు శివకుమార్, నాగేంద్ర, మజీద్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో ఘనంగా తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయ భూమి పూజ.

..పాల్గొన్న మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి మరియు ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గీతా జయసూర్య.

పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా శాశ్వత భవన నిర్మాణం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 06:**
నంద్యాల జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) బలోపేతానికి మరో కీలక అడుగు పడింది. నంద్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీప ప్రాంగణంలో పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి బుధవారం మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి , నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గీతా జయసూర్య, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తదితరులు పాల్గొని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, పునాది రాయి వేశారు. అనంతరం సర్వమత ప్రార్థనను నిర్వహించారు.. ఈ ప్రార్థన లో పాల్గొన్న ముస్లిం, క్రిస్టియన్ ,హిందూ మత పెద్దలకు నూతన వస్త్రాలు మంత్రులు , ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి మరియు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడినప్పటి నుండి పార్టీకి ఒక శాశ్వత భవనం లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందని . ఈ నూతన కార్యాలయ నిర్మాణంతో ఆ లోటు తీరపోతుందన్నారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఇది ఒక వేదికగా నిలుస్తుందని . ఇకపై పార్టీకి సంబంధించిన అన్ని రాజకీయ కార్యకలాపాలు, సమీక్షా సమావేశాలు మరియు ప్రజల సమస్యల పరిష్కార వేదికగా ఈ భవనం సేవలందిస్తుందని తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కార్యకర్తలకు సమన్వయ కేంద్రంగా ఈ కార్యాలయం పనిచేస్తుందని



అన్నారు . అత్యాధునిక వసతులతో కూడిన ఈ భవనాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు ధర్మవరం సుబ్బారెడ్డి, పార్వతమ్మ, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, డైరెక్టర్లు తులసి రెడ్డి, మునియార్ ఖలీల్, ఉప్పరి సురేష్ కుమార్, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, సెంట్రల్ ఫుడ్ కమిటీ మెంబర్ విశ్వనాథరెడ్డి మరియు స్థానిక పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# తమిళ రాజకీయ చరిత్రను తిరగరాసిన జోసెఫ్ విజయ్..!



## ...తమిళనాడు రాజకీయాలలో ప్రభంజనం సృష్టించిన విజయ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 06:**
భారతదేశ రాజకీయాలలో తమిళనాడు రాష్ట్రంలో సరికొత్త రాజకీయ చరిత్రను జోసఫ్ విజయ్ సృష్టించారు. ఆయన ఫిబ్రవరి 2 వ తేదీన 2024 వ సంవత్సరంలో తమిళగ వెట్రి కళగం (టి వి కె) పేరుతో పార్టీని అధికారికంగా ప్రకటించారు. అయితే 2024 సంవత్సరం జనవరి 25 వ తేదీన చెన్నైలో జరిగిన టీవీకే సమావేశంలో పార్టీ అధినాయకుడు, కార్యకర్తలు, పార్టీ నియమాలను ఎంపిక చేసి ఆమోదించినట్లు తెలిపాడు. తమిళగ వెట్రి కళగం లోకసభ ఎన్నికల్లో పోటీ చేయదని తెలిపారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేస్తామని తెలిపారు. ఆ నేపథ్యంలోనే పార్టీ జెండాను ఆగస్టు 21 వ తేదీన ఆవిష్కరించడం జరిగింది. ఈ పార్టీని ప్రముఖ తమిళ నటుడు విజయ్ స్థాపించారు. ఆయన దళపతి విజయ్ గా పేరు ప్రఖ్యాతులు, అయితే 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే లక్ష్యంతో ద్రావిడ రాజకీయాలకు భిన్నంగా అవినీతి రహిత పరిపాలన అందించేందుకు, పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ఈ పార్టీ ఏర్పాటు చేశారు. అద్భుతమైన ప్రజాధరణతో రాజకీయ పార్టీని స్థాపించిన రెండు సంవత్సరాల లోనే 2026 ఎన్నికలలో సంచలనాత్మకంగా విజయం సాధించి తమిళనాడు రాజకీయాలలో సరికొత్త చరిత్ర సృష్టించారు. 2009 వ సంవత్సరంలో ముందు ఆలోచనతో తన అభిమాన సంఘాలను స్థాపించి “విజయ్ మక్కల్ ఇయక్కం“అనే పేరుతో సేవా కార్యక్రమాలకు మళ్లించారు. 2021 వ సంవత్సరంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ఈ సంఘము 115 స్థానాలను కూడా గెల్చుకుంది. ఈ నేపథ్యంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా విజయ్ బాధ్యతలు చేపట్టి రాజకీయ ప్రవేశం చేసి సాంప్రదాయ పార్టీలైన డి.ఎం.కె, ఏ.ఐ.ఏడీ.ఎం.కే, పార్టీలకు గట్టి పోటీతో నెంబర్ వన్ పార్టీగా టీ .వీ .కే, అవతరించి 108 సీట్లతో విజయాన్ని సాధించారు. ఆంధ్రప్రదేశ్లోని దివంగత



ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తరువాత రెండు సంవత్సరాలలో విజయం సాధించిన నటుడుగా జోసెఫ్ విజయ్ చరిత్రను నమోదు చేశారు. ఆయన పార్టీ సిద్ధాంతాలు అవినీతి రహిత, పారదర్శక పరిపాలన, మత ప్రాంతీయ భేదాలు లేని సమాజం కోసం, లౌకిక వాదం కోసం, ఏకత్వాన్ని సాధించడానికి ప్రజల కోసం పనిచేయడానికి పార్టీనీ స్థాపించడం జరిగింది. ఈ పార్టీ ఏర్పాటుతో తమిళనాడు రాష్ట్రంలోని దశాబ్దాలుగా ఉన్న ద్రావిడ పార్టీల ఆధిపత్యానికి తెరపడి కొత్త రాజకీయ టీ.వీ.కె పార్టీ భారీ మెజార్టీ పార్టీగా ఏర్పడడం జరిగింది.

### జోసఫ్ విజయ్ కులాల పేర్లతో మతాల పేర్లతో ఓట్లు అడగలేదు

జోసెఫ్ విజయ్ రాజకీయ పార్టీ పెట్టిన తర్వాత ఆయన కులం పేరు చెప్పలేదు కులం పేరుతో ఓట్లు అడగలేదు. మతం పేరు చెప్పలేదు మతం పేరుతో ఓట్లు అడగలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఏం చేస్తానో చెప్పుడు, ఏమి చేయాలో చెప్పారు, టీవీకే పార్టీ ని ఎందుకు గెలిపించాలో మీరే నిర్ణయించాలని ప్రజలకు వదిలేశాడు. తమిళనాడు రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలు ఓట్లు వేశారు. అన్ని మతాలవారు టి.వి.కె పార్టీకి ఓట్లు వేశారు రాష్ట్ర ప్రజలందరూ కూడా దళపతి విజయ్ ని ముఖ్యమంత్రి కావాలని బలంగా ప్రజలు కోరుకున్నారు.కాబట్టి ఈరోజు తమిళనాడు రాజకీయాలలో ఓ ప్రభంజనం సృష్టించాడు. స్వయంకృషితో రాజ్యాధికారాన్ని సాధించాడు. అదేవిధంగా బహుజన పితామహుల యొక్క ఆలోచనలతో ముందుకెళ్లారు. మహాత్మ పూలే,డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, పెరియార్ రామస్వామి, వీరి యొక్క ఆలోచన విధానాలను అనుసరిస్తూ ముందుకెళ్లడం జరిగింది . మరియు ప్రముఖ సినిమా హీరోలైన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజీఆర్, ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వీరిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లారు. భారతదేశంలో ఎంతో మంది సినిమా హీరోలు రాజకీయ పార్టీలు స్థాపించి విజయాలను సాధించలేకపోయారు. ఈనాడు దేశమంతా దళపతి విజయ్ ని చర్చించుకుంటున్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వెనుకబడిన సామాజిక వర్గాలు ఏకమై తమిళనాడు ప్రజలను చూసి వారిని ఆదర్శంగా తీసుకొని రాజ్యాధికారాన్ని సాధిస్తారని, కోరుకుందాం. అలాగే జోసఫ్ విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటూన్నాను. తమిళనాడు ప్రజలందరికీ మంచి సేవ చేయాలని భగవంతుడు దీవెనలు ఆయనకు అన్ని విధాలుగా తోడుగా ఉండాలని కోరుకుందాం.